సాక్షి
మెదక్
సోమవారం, 2, సెప్టెంబర్, 2024



కొల్చారం(నర్సాపూర్): పరవళ్లు తొక్కుతున్న ఘనపురం

న్యూస్‌రీల్

కరెంట్‌తో జర భద్రం: ట్రాన్స్‌కో డీఈ

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని ట్రాన్స్‌కో డీఈ కృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తడిసిన కరెంట్ స్తంభాలను పట్టుకోవద్దని, వర్షం పడుతున్న సమయంలో స్టార్టర్ల వద్దకు వెళ్లవద్దని సూచించారు. ముఖ్యంగా కరెంట్ లైన్ కింద సెల్‌ఫోన్ మాట్లాడకూడదని చెప్పారు. పార్కులు, స్టేడియంలలో విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. ఇళ్లలో స్విచ్ బోర్డులను తడి చేతులతో వేయవద్దని.. ఇంటిబయట పెట్టిన లైట్లు నీటిలో తడవకుండా చూసుకోవాలన్నారు. గాలి దుమారం, వర్షం వల్ల తెగిన విద్యుత్ వైర్లను తాకకుండా దూరంగా ఉండాలన్నారు. ఉరుములు మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తొలగించి, టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్ స్విచ్‌లు ఆఫ్ చేయాలన్నారు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ డ్యామేజ్ అయితే సంబంధిత జెఎల్‌ఎం, ఏఎల్‌ఎం, ఎల్‌ఎం, లేదా ఏఈ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

అత్యవసరమైతేనే బయటకు రావాలి

మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్



సహాయక చర్యలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కమిషనర్

మెదక్ మున్సిపాలిటీ: రెండు రోజులుగా పట్టణంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పట్టణ ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి తక్షణ సహాయ చర్యలు అందించేందుకు వార్డుల వారీగా మున్సిపల్ సిబ్బందిని నియమించామని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని పలు వీధుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసరం ఉంటే తప్ప ఎవరూ కూడా ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. సహాయక చర్యల్లో పట్టణంలోని ఆయా వార్డుల్లో కమిషనర్ జానకిరామ్‌సాగర్, సిబ్బంది పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టారు. పట్టణ ప్రజలు సహాయక చర్యల్లో మున్సిపల్ అధికారులె, సిబ్బందికి సహకరించాలని కోరారు. ఇబ్బందులు ఏర్పడితే మున్సిపల్ చైర్మన్ 7660035444, కమిషనర్ 9154293322, డీఈ 9154293336, ఏఈ 9640756422, శానిటరీ ఇన్‌స్పెక్టర్ 9492574335 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

తూప్రాన్: బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న మతోన్మాద, ప్రజావ్యతిరేక, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా అఖిల భారతస్థాయిలో సీపీఎం పోరాటం నిర్వహిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేష్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా 15వ మహాసభల ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 2, 3 తేదీల్లో తూప్రాన్ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల మీద చర్చ జరుపుతామని వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్‌రెడ్డి, మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు కడారి నాగరాజు, సంతోష్, రమేష్, బలమని తదితరులు పాల్గొన్నారు.

కబ్జా చేసి ఇళ్లు కడితే కేసులు పెట్టండి

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: నాలాలు, మురుగు కాలువలు కబ్జా చేసి ఇళ్లు కడితే వారిపై కేసులు నమోదు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ముంపు ప్రాంతాల్లో ఆదివారం మంత్రి పర్యటించారు. ఇళ్లలోకి, దుకాణాల్లోకి నీరు చేరిన ప్రాంతాలను పర్యటించి బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎంత వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతామన్నారు. సిద్దిపేట–హుస్నాబాద్ వెళ్లే దారిలో బస్వాపూర్, కోహెడ, ముల్కనూర్ వద్ద రోడ్ల పై భారీగా వరద ప్రవహిస్తుందన్నారు. ఆ మార్గంలో ఎవరూ ప్రయాణం చేయవద్దని, పోలీస్‌లు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముంపు ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అనిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



మెదక్ పట్టణంలో పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- నేడు విద్యాసంస్థలకు సెలవు

మెదక్‌జోన్: అధికారుల సెలవులు రద్దు చేశామని, ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించిందన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించామని తెలిపారు. వర్షాల కారణంగా ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదకరంగా ప్రవహించే చెరువులు, కాలువల వద్దకు వెళ్లవద్దని ప్రజలకు సూచించారు. పోలీసులు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలను సురక్షితంగా కాపాడాలని కోరారు. పట్టణాల్లో రోడ్లపై నీరుచేరి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ప్రస్తుత పరిస్థితికి అనుగుణంగా ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విష జ్వరాలు ప్రబలకుండా వైద్యారోగ్యశాఖ చర్యలు చేపట్టాలన్నారు. విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని, ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూం నంబర్ 9391942254కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

వానజోరు.. వరద హోరు

జిల్లావ్యాప్తంగా 9.3 సెం.మీ నమోదు

- నిండుకుండలా ఘనపురం, హల్దీ
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- పలుచోట్ల నిలిచిపోయిన రాకపోకలు
- మరో రెండు రోజులు వర్ష సూచన



వెల్దుర్తి: పొంగిపొర్లుతున్న హల్దీ

మెదక్‌జోన్: జిల్లావ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఘనపురం, హల్దీ ప్రాజెక్టులు నిండుకుండను తలపిస్తున్నాయి. పలుచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి మెదక్ మండలం పాతూరులో అత్యధికంగా 20.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాపన్నపేట మండలం మినపూర్‌లో 13.3 సెంటీ మీటర్ల వర్షం కురిసిందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. వర్షాలకు జిల్లాలోని 2,238 చెరువులకు గాను ఇప్పటివరకు 400 చెరువులు పొంగిపొర్లుతుండగా.. మరో 100 చెరువులు అలుగుపారేందుకు సిద్ధంగా ఉన్నాయని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

జిల్లాల్లో ముఖ్యమైన సంఘటనలు

- మెదక్ పట్టణంలోని ఆటోనగర్, ఇంద్రపురికాలనీ, వెంకట్రావునగర్, వీరహనుమాన్ నగర్ కాలనీ, గాంధీనగర్, రాందాస్ చౌరస్తాలో నీరు నిల్వకుండా మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపట్టారు.
- 1వ వార్డు ఔరంగాబాద్ రహదారితో పాటు చమాన్ ప్రాంతంలో మురికి కాలువలు పొంగిపొర్లాయి. కలెక్టర్ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.
- హవేళిఘనపూర్ మండల పరిధిలోని ముత్తాయికోటలో మహబూబ్‌నహర్ కెనాల్‌పై నుంచి నీరు పొంగిపొర్లుతోంది.
- అప్రమత్తమైన ఇరిగేషన్ అధికారులు జేసీబీతో కట్టపై మట్టిని పోయిచారు. కట్టతెగితే పంట పొలాలు, గ్రామంలోకి నీరు వచ్చే ప్రమాదం ఉంది.
- ఇదే మండలంలోని దూప్‌సింగ్ తండా ప్రాంతంలో గంగమ్మవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తండాకు రాకపోకలు నిలిచిపోయాయి.
- పాతూరు– రాయినిపల్లి మధ్యగల వాగు వంతెనపై వరదనీరు ప్రవహిస్తుండడంతో రెండు గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోయాయి.
- తూప్రాన్ మండల పరిధిలోని హల్దీవాగు పొంగిపొర్లుతుంది. వాటిపై నిర్మించిన చెక్‌డ్యాంలు, బ్రిడ్జిలు నిండుకుండను తలపిస్తున్నాయి.
- కిష్టాపూర్, అంబోత్‌పల్లితో పాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- మండలంలోని గడ్డలవాగు పొంగిపొర్లడంతో రాజిపేట– రాజిపేట తండాకు రాకపోకలు నిలిచిపోయాయి. అక్కడ పోలీసులు రహదారిని మూసివేశారు.
- నర్సాపూర్– హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీ వృక్షం నేలవాలింది. దీంతో ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.
- నర్సాపూర్ మున్సిపల్ సిబ్బంది, పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని చెట్టును రోడ్డుపై నుంచి తొలగించారు.
- టేక్మాల్– జోగిపేట మధ్య గుండువాగుపై నిర్మించిన బ్రిడ్జి మీది నుంచి వరద పెద్దఎత్తున కొనసాగుతోంది.
- విషయం తెలుసుకున్న అధికారులు రెండు వైపులా ముళ్ల కంచెలు వేయించి పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

మండలాల వారీగా వర్షపాతం (మి. మీలలో)	
మెదక్	203.0
పాపన్నపేట	127.0
కౌడిపల్లి	112.5
నర్సాపూర్	101.0
రేగోడు	98.3
అల్లాదుర్గం	93.3
నార్సింగి	60.5
చేగుంట	60.3
వెల్దుర్తి	57.3
తూప్రాన్	51.5
చిన్నశంకరంపేట	51.5
మాసాయిపేట	51.0
చిలప్‌చెడ్	48.0
రామాయంపేట	47.0
టేక్మాల్	39.3



కొల్చారం(నర్సాపూర్): పత్తి చేనులో చేరిన వర్షపు నీరు



హవేళఘణాపూర్(మెదక్): పోచారం డ్యాంకు జలకళ



టేక్మాల్- జోగిపేట రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు



నిజాంపేట: వెంకటాపూర్(కె)లో వర్షం ధాటికి దెబ్బతిన్న ఇల్లు

అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ



వరద పరిస్థితిని సమీక్షిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆదివారం సాయంత్రం ఆయన ఏడుపాయల ఆలయం, వనదుర్గ ప్రాజెక్టును పరిశీలించి మాట్లాడారు. వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ప్రజలు, భక్తులు వెళ్లకుండా చూడాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ప్రజలు బయటకు రావాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, చెట్ల కింద ఉండొద్దని, దూర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలన్నారు. అవసరమైన చోట ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని, సహాయక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అత్యవసరమైతే డయల్ 100 లేదా 87126 57888 నంబర్లలో సంప్రదించాలన్నారు. సెల్ఫీల కోసం ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలకు గురికావొద్దని తెలిపారు. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడానికి డీడీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితులలో తప్ప బయటకు రాకూడదన్నారు. మంజీరా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయనతో పాటు ఈఓ చంద్రశేఖర్, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, తహసీల్దార్ సతీశ్, సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసగౌడ్, నీటిపారుదల శాఖ ఏఈ విజయకుమార్ సిబ్బంది ఉన్నారు.

నాచగిరిలో భక్తుల సందడి



నాచగిరి ఆలయంలో భక్తులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రం శ్రావణమాసం ఆదివారం రోజు భక్తులతో కిటకిటలాడింది. సెలవురోజు కావడం, శ్రావణమాసం ముగుస్తుండడంతో వర్షం లెక్కచేయకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. క్షేత్రంలో 30 సత్యనారాయణ వ్రతాలు జరగగా, 3000 మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించారు.



ఆలయం ముందు నుంచి వెళ్తున్న వరద

జలదిగ్బంధంలో దుర్గమ్మ

పాపన్నపేట(మెదక్): మంజీరా వరదలతో ఘనపురం ఆనకట్ట పొంగిపొర్లుతుంది. దీంతో మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గ ఆలయం జలదిగ్బందంలో చిక్కుకుంది. ముందు జాగ్రత్త చర్యగా ఆదివారం ఆలయాన్ని మూసివేశారు. ఉదయం ఆలయాన్ని తెరిచి భక్తులకు దర్శనం కల్పించారు. అయితే ఆలయం ముందు నుంచి స్వల్పంగా మంజీరా ప్రవహించడంతో భక్తులకు ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉందని సిబ్బంది ఆలయాన్ని మూసివేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు నిర్వహిస్తున్నారు. వర్షం ఇలాగే కొనసాగితే రాత్రి వరకు ఆలయం ముందు ఉన్న బ్రిడ్జిపై నుంచి మంజీరా వరద పోయే అవకాశం ఉంది. వర్షాలు తగ్గి మంజీరా శాంతించే వరకు రాజగోపురంలోనే పూజలు నిర్వహిస్తామని ఆలయ ఈఓ చంద్రశేఖర్ వెల్లడించారు. ఇదిలా ఉండగా ఏడుపాయల్లో ఎలాంటి ప్రమాదకర సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి స్వయంగా సమీక్షిస్తున్నారు. భక్తులు ఎవరూ రాజగోపురం ముందుగా బారికేడ్లను దాటి ఆలయం దిక్కు వెళ్లొద్దని ఆదేశించారు.

‘పాత పెన్షన్’కై మరో ఉద్యమం



నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు

టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్

మెదక్‌జోన్: నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలుకు మరో చారిత్రాత్మక ఉద్యమం చేస్తామని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ స్పష్టం చేశారు. సెప్టెంబర్ ఒకటి పెన్షన్ విద్రోహ దినంగా పరిగణించి ఆదివారం టీఎన్‌జీవో భవన్‌లో ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిరసన సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన పెన్షన్ విధానంతో సీపీఎస్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఇకముందు ఏ ఒక్క ఉద్యోగి నష్టపోకుండా పాత పెన్షన్ విధానం అమలులోకి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం టీపీటీఎఫ్ పీఆర్‌టీయూ, టీఎటీయూ, యూటీఎఫ్, టీసీపీఎస్, తదితర ఉపాధ్యాయ యూనియన్ల జిల్లా అధ్యక్షులు సంగయ్య, శ్రీనివాస్, రాజగోపాల్‌గౌడ్, పద్మారావు, ఎల్లం మాట్లాడారు. పాత పెన్షన్ విధానం అమలు కోసం ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో మరో ఉద్యమానికి శ్రీకారం చూడదామని పిలుపునిచ్చారు. అనంతరం ‘సీపీఎస్ అంతం టీజేఏసీ పంతం’ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వర్షం దృష్ట్యా మహా ర్యాలీని నిరసన సభగా మార్చారు. కార్యక్రమంలో టీఎన్జీవో, ట్రెస, పీఆర్‌టీయూ, విశ్రాంత ఉద్యోగుల సంఘం, తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన కొత్త అధికారులు

మెదక్ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీల్లో భాగంగా జిల్లా నుంచి 18 మంది అధికారులు బదిలీ కాగా వారి స్థానంలో కొత్తవారు కొలువు దీరారు. అలాగే 21 మంది తహసీల్దార్లకు స్థానచలనం కల్పించారు. ఇదే జిల్లాలోని ఒక మండలం నుంచి మరో మండలానికి బదిలీ చేశారు. హవేళిఘనపూర్ మండలానికి బదిలీ అయిన తహసీల్దార్ హర్దిప్‌సింగ్ హైడ్రాకు అదనపు బాధ్యతలపై వెళ్లారు. అక్కడి డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి జూలై 31న పదవీ విరమణ చేశారు. అలాగే జిల్లా విద్యుత్‌శాఖ ఈఈ జానకీరాములు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి కృష్ణమూర్తి, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ శనివారం రిటైర్మెంట్ పొందారు. సత్యనారాయణ స్థానంలో మెదక్ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవికి అదనపు బాధ్యతలు అప్పగించారు. విద్యుత్‌శాఖ ఈఈ, పరిశ్రమల శాఖ అధికారి స్థానంలో కొత్త వారు రావాల్సి ఉంది.



అదనపు బాధ్యతలు..

శ్రీనివాస్‌రెడ్డి (జిల్లా ఎక్సైజ్‌శాఖ), నాగరాజుగౌడ్ (బీసీ వెల్ఫేర్), వెంకటయ్య (పశు సంవర్ధశాఖ), గోపాల్‌సింగ్ (విజయడెయిరీ డీడీ), బ్రహ్మాజీ (జిల్లా స్త్రీ,శిశు సంక్షేమశాఖ) వీరితో పాటు మొదటి నుంచి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులు నాగరాజు (మార్కెటింగ్ ఏడీ), అనిల్‌కుమార్ (వయో వృద్ధుల విద్యాశాఖ), వెంకటేశ్వర్‌రావు (గ్రౌండ్ వాటర్), యాదయ్య (అసిస్టెంట్ లేబర్ అధికారి), రామరాజు (జిల్లా ఉపాధి కల్పన అధికారి), శ్రీనివాస్ (జిల్లా సర్వే అధికారి), సుధాకర్ యాదవ్ (లీగల్ మెట్రాలజీ), క్రాంతి (మార్క్‌ఫెడ్), శ్రీకాంత్‌రెడ్డి (హ్యాండ్లూమ్), రామ్మోహన్‌రావు (డీఎం సోలార్), నరేష్ (ఆరోగ్యశ్రీ) అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

వచ్చిన వారు వీరే..

దామోదర్‌రెడ్డి (యువజన క్రీడలు), మాధవి (ఇంటర్ విద్యాశాఖ అధికారి), చంద్రకళ (డ్రగ్ ఇన్‌స్పెక్టర్), ప్రతాప్ సింగ్ (హార్టికల్చర్), నీలిమ (గిరిజన సంక్షేమ శాఖ), శశికళ (ఎస్సీ వెల్ఫేర్), వెంకటస్వామి (ఆర్డీఓ), సురేష్‌రెడ్డి (డీఎస్‌ఓ), సురేఖ (ఆర్టీసీ డీఎం), శివదయాల్ (జిల్లా కేంద్రంలోని ఆస్పత్రుల సూపరింటెండెంట్), జోజీ (ఫారెస్ట్ జిల్లా అధికారి), మల్లేశం (జిల్లా మత్స్యశాఖ), వేణు (అగ్నిమాపక అధికారి), మాన్య నాయక్ (చీఫ్ ప్లానింగ్ శాఖ), గౌసాన్నీసాబేగం (కలెక్టరేట్ సూపరింటెండెంట్) బదిలీపై వచ్చారు.

క్లుప్తంగా

పర్యావరణవేత్త డాక్టర్ కిషన్ రావు కన్నుమూత


కిషన్ రావు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ అల్లాని కిషన్ రావు (86) పటాన్ చెరు మండలం నందిగామ గ్రామంలోని స్వగృహంలో ఆదివారం మరణించారు. ఎంబీబీఎస్ చదివిన కిషన్ రావు 1977లో పటాన్‌చెరులో యశోద హాస్పిటల్ ఏర్పాటు చేశారు. 1980 నుంచి ఏర్పాటు అవుతున్న పరిశ్రమలు తీవ్రస్థాయిలో కాలుష్యం వదులుతుండటంతో ఆయన పోరుబాట పట్టారు. ప్రజల్లో చైతన్యం తీసుకొని వచ్చి ధర్నాలు, ఆందోళనలకు శ్రీకారం చుట్టారు. పటాన్‌చెరు– బొల్లారం కాలుష్యాన్ని వెలుగులోకి తెచ్చి సుప్రీంకోర్టు వరకు న్యాయ పోరాటం చేశారు. ప్రముఖ పర్యావరణవేత్త దివంగత చిదంబరంతో కలసి ప్రజా ఉద్యమాన్ని నిర్వహించారు. వృద్ధాప్యం రావడంతో ఆయన నందిగామ గ్రామంలో కేంద్ర గోశాల ఏర్పాటు చేసి గోవులకు సేవలందిస్తూ జీవిస్తున్నారు. కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న కిషన్‌రావు ఆదివారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు.

చర్చిని సందర్శించిన మధ్యప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి


విమల జైన్‌ను సన్మానిస్తున్న చర్చి గురువులు

మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్‌ఐ చర్చిని మధ్యప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి విమల జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా చర్చి గురించి ప్రెసిబెటరి ఇన్‌చార్జి శాంతయ్య వివరించారు. అంతకు ముందు వారిని శాలువా సన్మానించారు. ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో భక్తుల సంఖ్య తగ్గింది. భక్తులనుద్దేశించి మత గురువు శ్రీనివాస్, శాంతయ్య దైవ సందేశాన్ని ఇచ్చారు.

ధర్మరక్షణలో వీహెచ్‌పీ వెన్నుచూపని పోరాటం


మాట్లాడుతున్న బాలస్వామి

రామాయంపేట(మెదక్): ధర్మ రక్షణలో విశ్వ హిందూ పరిషత్ వెన్ను చూపని పోరాటం చేస్తుందని వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాల బాలస్వామి పేర్కొన్నారు. వీహెచ్‌పీ షష్ఠి పూర్తి వేడుకల సందర్భంగా శనివారం రాత్రి భరతమాత మందిర్‌లో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. హిందువుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందిస్తూ గత వైభవం దిశగా వారిని చైతన్య పరుస్తున్నామని పేర్కొన్నారు. కులాలకు, రాజకీయాలకు అతీతంగా హిందువులంతా సంఘటితమై ధర్మరక్షణకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు విజయ్ కుమార్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పబ్బ సత్యం, జిల్లా సంఘటనా కార్యదర్శి పుట్టి మల్లేశం, జిల్లా కోశాధ్యక్షుడు ఎర్ర ముత్యాలు, జిల్లా మాతృశక్తి ప్రముఖ్ అనంతలక్ష్మి, ప్రఖండ అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

నర్సాపూర్: ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు ఆదివారం వర్షం పడుతున్నా ర్యాలీ తీసి చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. 2004 నుంచి అమలవుతున్న నూతన పెన్షన్ విధానంతో ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భద్రత లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాల జేఏసీ పిలుపు మేరకు స్థానిక జేఏసీ ఆధ్వర్యంలో ఎంఆర్‌సీ భవనం నుంచి ర్యాలీ చేపట్టి చౌరస్తాలో నిరసన ప్రదర్శన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు శ్రీనివాస్‌రావు, డాకియా, నాగుల్ మీరా, రమేశ్‌రావు, శివ కుమార్, అప్పలనాయుడు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వి'నాయకా'..


కృష్ణుడి అవతారంలో..

సిద్దిపేట పట్టణశివారులోని పలుచోట్ల గణపతి విగ్రహాలను తయారు చేస్తున్నారు. వివిధ రూపాలతో భారీ గణపతులు ఇప్పటికే పూర్తి అయ్యాయని తయారీదారులు పేర్కొంటున్నారు. 2 అడుగుల నుంచి 20 అడుగుల వరకు విగ్రహాలు కనువిందు చేస్తున్నాయి. సిద్దిపేటరూరల్ మండల పరిధిలోని చిన్నగుండవెల్లికి చెందిన యువకులు మహేశ్, రాజశేఖర్ మట్టితో గణపతులను తయారు చేసిన వాటికి వివిధ రకాల రంగులతో అందంగా తీర్చిదిద్దారు.

– ఫొటోలు: స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయకులు



అయోధ్య రామ మందిరంలో వినాయకుడు


గరుడ పక్షిపై గణనాథుడు

దారుణం

సహకార సంఘంలో బోగస్ పంట రుణాలు

- రికార్డులు మారుస్తూ దరఖాస్తులు
- మోకాపై లేకున్నా మార్ట్‌గేజ్ చేసి పొందుతున్న వైనం
- విచారణ చేయకుండానే మంజూరు చేస్తున్న బ్యాంకు అధికారులు
- ఒకరి పాసు పుస్తకం మరొకరి పేరు మీద
- రైతులకు తప్పని ధరణి కష్టాలు



హుస్నాబాద్ సహకార బ్యాంకు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ విశాల పరపతి సంఘంలో బోగస్ పంట రుణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. రైతులు పంట రుణాలకు దరఖాస్తు చేసుకుంటే బ్యాంకు అధికారులు వెళ్లి ఆ భూమిని, పంటలను పరిశీలించాలి. కానీ అలాంటి ఏవీ చేయకుండానే రుణాలు మంజూరు చేస్తున్నారు. అలాగే, ధరణిని ఆసరాగా చేసుకొని కొందరు పట్టా పాస్ పుస్తకాలు సృష్టించుకొని మోకాపై భూమి లేకున్నా పంట రుణాలు తీసుకుంటున్నారు. బ్యాంక్ అధికారులు సైతం ఎలాంటి తనిఖీలు లేకుండా కేవలం పాస్ పుస్తకాలు చూసి మార్ట్‌గేజ్ చేసుకొని రుణం మంజూరు చేస్తున్నారు. ఇలా అడ్డగోలిగా రుణాలు తీసుకునే వారు ఎక్కువ కావడంతో అసలైన రైతులకు రుణాలు అందడం లేదు. అలాగే, ప్రభుత్వం చేసే రుణమాఫీ కూడా కావడం లేదని అర్హులు గగ్గోలు పెడుతున్నారు.

అందని రూ.2 లక్షల రుణమాఫీ

ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తే విశాల పరపతి సంఘంలోనే చాలా మందికి రుణ మాఫీ జరగలేదు. ధరణిలో వచ్చిన పట్టాదారు పాసు పుస్తకాలు పెట్టి ఒక బ్యాంకులో రుణం తీసుకుంటే, పాత పట్టాదారు పాసు పుస్తకాలను మరో బ్యాంకుల పెట్టి మార్ట్‌గేజ్ రుణం తీసుకోవడంతో ఒకే రైతు పేరున రూ. 3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు రుణం చూయిస్తుంది. ఇలాంటి రైతులకు పంట రుణమాఫీ జరగడం లేదు. మోకాపై భూములు లేని రైతులు కూడా పంట రుణాలు తీసుకుంటున్నారని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు.

భూమి ఒకరిది, పట్టా పాస్ పుస్తకం మరొకరిది

హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్), మీర్జాపూర్ గ్రామాల్లో ధరణిలో ఉన్న లోపాలను ఆసరా చేసుకొని కొందరు బోగస్ పట్టాలను క్రియేట్ చేసుకున్నారు. 30 ఏళ్ల కింద నుంచి కబ్జాలో ఉండి పంటలు సాగు చేస్తున్న రైతుల భూములను కొందరు పట్టాలు చేసుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఒకే భూమిని ఏడాదిలో ముగ్గురి పేరిట పట్టాలు మార్పించి బ్యాంకులో పంట రుణం కోసం మార్ట్‌గేజ్ రుణానికి దరఖాస్తు చేసుకున్నారు. పోతారం (ఎస్) సర్వే నంబర్లను క్షుణంగా పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులకు మంగళవారం ఇలాంటి కేసు రిజిస్ట్రేషన్‌కు రావడంతో మార్ట్‌గేజ్‌ను తిరస్కరించారు. రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించి రుణాలు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం రైతుల భూ సమస్యలను పరిష్కరించడానికి కొత్త ఆర్‌ఓఆర్ చట్టం తీసుకొస్తుంది. కొత్త చట్టం వచ్చే లోపలే బోగస్ పట్టా పాసు పుస్తకాలను తాకట్టు పెట్టి రుణాలు పొందడానికి దళారులు ప్రయత్నం చేస్తున్నారు.

ఫీల్డు ఆఫీసర్ పరిశీలించాకే రుణం ఇస్తాం

రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఉంటే భూమి మార్ట్‌గేజ్ చేసుకొని పంట రుణాలు ఇస్తాం. మా బ్యాంకు ఫీల్డు ఆఫీసర్ పంటలను, భూములను పరిశీలించిన తర్వాతనే రుణాలు మంజూరు చేస్తాం. మీర్జాపూర్‌కు చెందిన భూమి వివాదం విషయం తహసీల్దార్ చెబితే మాకు తెలుసు అప్పటి వరకు మాకు తెలువదు. మేం ఆన్‌లైన్ ధరణి రికార్డులను పరిగణలోకి తీసుకుంటాం. మోకాపై ఎవరు ఉన్నది రెవెన్యూ అధికారులు చూసుకోవాలి.

– తిరుమల, ఇన్‌చార్జి సీఈఓ, విశాల పరపతి సంఘం

విచారణ చేసి రుణాలు ఇవ్వాలి



పోతారం(ఎస్), మీర్జాపూర్ భూములు వివాదంలో ఉన్నాయి. ఒకరికి పట్టా పాసు పుస్తకం ఉంటే మరొకరు భూమి సాగు చేస్తున్నారు. బోగస్ పట్టాలు రద్దు చేసి 30 ఏళ్ల నుంచి కాస్తులో ఉన్న మాకు పట్టాలు ఇవ్వాలని రైతులు మా కార్యాలయం ఎదుట ధర్నాలు చేస్తున్నారు. మోకా మీద భూమి లేదు, పంట లేదు బ్యాంకు అధికారులు పంట రుణం ఏట్లా ఇస్తారు..? మోకా విచారణ చేయకుండానే భూమి మార్ట్‌గేజ్ కోసం మా దగ్గరకు బాధ్యత గల అధికారులు ఏట్లా వస్తారు. పాస్ పుస్తకం ఉంటే సరిపోదు భూమి చూసి మోకాపై ఎవరు ఉన్నారని విచారణ చేసి రుణాలు ఇవ్వండి.

– రవీందర్‌రెడ్డి, తహసీల్దార్, హుస్నాబాద్

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు

– ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కొండపాక(గజ్వేల్): ఆర్టీసీ బస్సును కారు ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొండపాక గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నంగునూరు మండలంలోని పాలమాకుల గ్రామానికి చెందిన నాగరాజు, నర్సింలు, లక్ష్మణ్ కారులో జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మ తల్లి దర్శనార్థం వెళ్తున్నారు. ఈ క్రమంలో కొండపాక గ్రామ శివారులోకి రాగానే హైదరాబాద్ వైపునకు వెళ్తున్న ఆర్టీసి బస్సును వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న టోల్‌ప్లాజా అంబులెన్సు సిబ్బంది క్షతగాత్రులను సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తితోపాటు గేదె మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని నందికంది గ్రామంలో చోటు చేసుకుంది. ఆదివారం సదాశివపేట సీఐ మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నందికంది గ్రామానికి చెందిన అమ్రోది మల్లేశం(41) శనివారం గేదెను మేపడానికి వెళ్లి తిరిగి రాత్రి ఇంటికొస్తున్నాడు. గ్రామ శివారులోని బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో కంపెనీ సమీపంలో జాతీయ రహదారిని దాటుతుండగా సదాశివపేట వైపు నుంచి నందికంది వైపు వస్తున్న ఐచర్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశం, గేదె అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అదుపుతప్పి.. చెట్టును ఢీకొట్టి


కారును పరిశీలిస్తున్న పోలీసులు

రామాయంపేట(మెదక్): రామాయంపేట శివారులో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు అతి వేగంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నిజామాబాద్ చెందిన చాంద్‌పాషాతోపాటు జగదీశ్, మరొకరు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనిషి సామాజిక సంబంధాల సమాహారం

- ప్రతీ వ్యక్తి స్వీయ చరిత్ర రాయాలి
- 'బాట ముచ్చట' పుస్తకావిష్కరణలో వక్తలు


పుస్తకావిష్కరణలో దేశపతి, నందిని, వేణుగోపాల్, దేవీప్రసాద్ తదితరులు

సిద్దిపేటజోన్: మనిషి అంటేనే సామాజిక సంబంధాల సమాహారం అని, ప్రతీ వ్యక్తి తన స్వీయచరిత్ర రాయాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం రాత్రి స్థానిక ప్రెస్ క్లబ్‌లో రచయిత దారం మల్లారెడ్డి రచించిన 'బాట ముచ్చట' పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతంలో ఐదు దశాబ్దాలుగా జరిగిన పరిణామాలకు ప్రతిరూపం ఈ పుస్తకమని పేర్కొన్నారు. తాను నమ్మిన భావజాలంను గొప్పగా ప్రేమించడం వల్లే సైద్ధాంతిక భూమికతో రచించినట్టు పేర్కొన్నారు. ప్రముఖ రచయిత నందిని సిద్దారెడ్డి మాట్లాడుతూ.. తన జీవితంలో జరిగిన ఘటన ఆధారంగా పుస్తకం రాసినట్టు తెలిపారు. వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న పరిణామాలను, ఉద్యమాలను, మార్పులను గమనిస్తూ ఆయా ఘటనల్లో భాగస్వామ్యమైన సమూహంతో నడిచే వ్యక్తులు రాసే స్వీయచరిత్రలు సామాజిక చరిత్రలుగా నిలబడుతాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతంలో 50 ఏళ్లలో జరిగిన అనేక సామాజిక పోరాటాలను పుస్తకం రికార్డు చేసిందన్నారు. వివిధ దేశాల్లో వివిధ భాషల్లో రచయితలు తమ స్వీయచరిత్రలు రాశారని, ఇంగ్లిషు భాషలో కూడా చాలా రచనలు వచ్చాయన్నారు. తెలుగు రచయితలు, సామాజిక ఉద్యమకారులు తమ స్వీయచరిత్రలు రాయలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, ప్రముఖ కవులు, రచయితలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏకకాలంలో నాలుగు ఇళ్లల్లో చోరీ

బంగారం, వెండి, రూ.2.06 లక్షలు అపహరణ


దర్యాప్తు చేస్తున్న పోలీసులు

నర్సాపూర్ రూరల్: తాళాలు వేసిన నాలుగు ఇళ్లలో చోరీ జరిగిన ఘటన నర్సాపూర్ మండలం నత్నాయపల్లిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన రెండు కుటుంబాలు ఇళ్లకు తాళాలు వేసి ఆస్పత్రికి వెళ్లగా మరో రెండు కుటుంబాల వారు బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ప్రభాకర్ ఇంటి తాళాన్ని ధ్వంసం చేసి 15 తులాల బంగారం, రూ.1.30 లక్షలు ఎత్తుకెళ్లారు. ప్యాట కిష్టయ్య ఇంట్లో నుంచి 25 తులాల వెండి, రూ.25 వేల నగదు దోచుకెళ్లారు. నీలి సునీత ఇంట్లో నుంచి 24 తులాల గొలుసులు, రూ.35 వేల నగదు అపహరించారు. అలాగే, నీలి చిన్న పోచమ్మ ఇంట్లో నుంచి రూ.16 వేల నగదు ఎత్తుకెళ్లారు. పనుల వెళ్లిన బాధితులు ఇంటికొచ్చే సరికి తాళాలు పగులగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుల ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని పోలీసులు క్లూస్ టీమ్ ను రప్పించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాలరి అదృశ్యం

బెజ్జంకి(సిద్దిపేట): చేపల వేటకు వెళ్లి జాలరి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండలంలోని తోటపెల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద గల కల్వర్టులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తోటపల్లి గ్రామానికి చెందిన పలువురు జాలర్లు ఆదివారం కల్వర్టులో చేపలు పట్టారు. ఆటోలో ఇంటికి వెళ్దామని వారు బయటకు రాగా లక్ష్మణ్ మాత్రం సైకిల్ మీద వస్తానన్నాడు. కానీ ఇంటికి రాకపోడంతో కుటుంబ సభ్యులు కల్వర్టు వద్దకు వెళ్లగా సైకిల్ కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఏసీపీ మధు, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి,ఎస్ఐ కృష్ణారెడ్డి, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సోమవారం గాలింపు చర్యలు చేపడుతామన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

నర్సాపూర్ రూరల్: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నర్సాపూర్ ఎస్సై లింగం కథనం మేరకు.. నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంట గ్రామానికి చెందిన ముద్దం మల్లేశ్ (41) కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఆగస్టు 10వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు నర్సాపూర్ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. ఆదివారం మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మిన్‌పూర్‌లో ఒకరు...

పాపన్నపేట (మెదక్): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మిన్‌పూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన కర్రోళ్ల శ్రీశైలం(52) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆగస్టు 24న పొలంలో పురుగుల మందు కొడుతుండగా చేస్తుండగా స్పృహతప్పి పడిపోయాడు. కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆవును కాపాడి.. తాను ప్రాణాలు వదిలాడు

– కెనాల్‌లో పడి రైతు మృతి

కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని రామచంద్రాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బొబ్బుల కనకారెడ్డి(60)కి చెందిన వ్యవసాయ భూమి కెనాల్ సమీపంలో ఉంటుంది. అక్కడే కొట్టంలో ఆవు కట్టేయగా ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడింది. దానిని కాపాడటానికి రైతు కెనాల్‌లోకి దిగాడు. వర్షానికి వరద ఎక్కువగా రావడంతో అడుగున ఉన్న నీటి బురదలో రైతు ఇరుక్కుపోయి ఊపిరాడక రైతు మృతి చెందాడు. ఆవు ప్రాణాలతో బయటపడింది. మొదట కాల్వలో దిగినప్పుడు సమీప రైతులు చూసి కొట్టుకుపోయాడని అనుకున్నారు. కానీ బురదలో ఇరుక్కుపోయాడని చూసి బయటకు తీశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేశారు.

పడకేసిన పారిశుద్ధ్యం

- సంగారెడ్డిలో ఎక్కడి చెత్త అక్కడే
- దోమలు, పందులు స్వైరవిహారం
- ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు
- కానరాని ఫాగింగ్
- అధికారుల మొక్కుబడి చర్యలు



ఇది సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయ సమీపంలోని బొబ్బలి కుంట. గతంలో దాదాపు రూ.20 లక్షలు ఖర్చు చేసి సుందరీకరణ చేసినట్లు అధికారులు రికార్డుల్లో చూపారు. కానీ అక్కడ చూస్తే అందుకు భిన్నంగా ఉంది. కుంట పరిసరాలు తీవ్ర దుర్గంధంగా మారాయి. చిన్నపాటి వర్షానికే నీళ్ల నిలిచి బురదమయంగా మారింది. దీంతో దోమలు వృద్ధి చెంది స్థానికులు విషజ్వరాల బారినపడుతున్నారు. ఇది ఒక్క బొబ్బలికుంట పరిస్థితే కాదు. సంగారెడ్డిలో ఎక్కగా చూసినా అపరిశుభ్రం వాతావరణం కన్పిస్తుంది.

సంగారెడ్డి: జిల్లా కేంద్రం సంగారెడ్డి పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. కాలనీల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు పేరుకుపోయాయి. డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ప్రజలు డెంగీ బారిన పడి ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ప్రధానమైన ప్రాంతాల్లో మాత్రమే రోడ్లు, మురికి కాల్వలు శుభ్రం చేస్తున్నారని శివారు కాలనీల్లో పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

అధికారుల సమన్వయ లోపం..

పట్టణంలో వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ అధికారుల మధ్య సమన్వయం లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గతంలో డెంగీ కేసు నమోదైతే పాలకులు, అధికారులు ఇంటింటా సర్వే చేసేవారు. ప్రస్తుతం అలాంటి చర్యలు చేపట్టడం లేరు. డెంగీ కేసులు బారీగా నమోదు అవుతున్నా అధికారులల్లో చలనం లేదు. అలాగే బల్దియా అధికారులు సుమారు రూ.4 లక్షలకు పైగా వెచ్చించి ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేశారు. పర్యవేక్షణ లేక వాటిని మూలన పడేశారు. ప్రస్తుతం రెండు ఫాగింగ్ యంత్రాలతో మొక్కుబడిగా చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. అలాగే, ఎన్నో ఏళ్ల కిందట కొనుగోలు చేసిన బ్లీచింగ్ పౌడర్‌ను ప్రస్తుతం మున్సిపల్ అధికారులు మురికి కాల్వల్లో చల్లుతున్నారు. బ్లీచింగ్ పౌడర్ పూర్తిగా పాడైపోయి తెల్లటి సున్నం మాదిరిగా కనిపిస్తుందే తప్ప ఎలాంటి వాసన రావడం లేదని మున్సిపల్ సిబ్బందే వాపోతున్నారు.


ఎంపీపీ కార్యాలయం పక్కన చెత్త

మూలన పడిన యంత్రాలు

మున్సిపాలిటీలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న చెత్త సేకరణ వాహనాలు కొద్దిగ పాడైనా పూర్తిగా మూలకు పడేస్తున్నారు. కొనుగోలు చేసిన ఎంతటి కొత్త వాహనమైనా సరే దానికి ఎలాంటి సర్వీసింగ్‌లు చేయకుండానే బిల్లులు కాజేస్తున్నట్లు తెలుస్తుంది. శానిటేషన్ వ్యవస్థలో పని చేస్తున్న అధికారులు కుమ్మక్కై పారిశుద్ధ్య నిర్వహణలోని ఆయా విభాగాలకు చెందిన బిల్లులు చేసుకుంటూ స్వాహా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చర్యలు చేపడుతున్నాం



దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ శుక్రవారం డ్రై డే చేపడుతున్నాం. నీటి నిల్వ ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తున్నాం. ఫాగింగ్ చేయిస్తున్నాం. ఇప్పటి వరకు డెంగీ, మలేరియా కేసులు నమోదు కాలేదు. ప్రజలు కూడా తమ ఇళ్ల ఆవరణల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

– ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్, సంగారెడ్డి